సాక్షి గుంటూరు

మంగళవారం ¦ 22 ¦ ఏప్రిల్ ¦ 2025



శీతలాంబ ఆలయ వార్షికోత్సవం


ఫిరంగిపురం: వేమవరంలోని శీతలాంబ ఆలయం 34వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



దేవస్థానం వార్షికోత్సవం

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

27న చండీ హోమం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో 27న అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ కె. సునీల్ కుమార్ తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రధాని పర్యటనకు పోలీస్ సిబ్బంది

మంగళగిరి నార్త్ సబ్ డివిజన్‌లో ఏర్పాట్లు



మంగళగిరి టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని పలు స్కూళ్లు, కాలేజీలను సోమవారం సిబ్బందితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మే 2న ప్రధాని మోదీ రాజధాని అమరావతికి రానున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆరు వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తుకు రానున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, కల్యాణ మండపాలలో మూడు రోజుల ముందు నుంచే సిబ్బంది ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా జడ్జిగా కల్యాణ్ చక్రవర్తి



గుంటూరు లీగల్ : జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బి.కల్యాణ్ చక్రవర్తిని సోమవారం జిల్లా ప్రెసిడెంట్ తుబాటి శ్రీను, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, టౌన్ ప్రెసిడెంట్ లక్ష్మనాయక్ మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ నవీన్, స్టేట్ జనరల్ సెక్రటరీ పి. రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ బ్రహ్మయ్య, శేషగిరి, హరిబాబు, ఖాజా, కల్యాణి, సాయి అభిజిత్, శివారెడ్డి పాల్గొన్నారు.

చైల్డ్ ఫ్రెండ్లీ కోర్ట్ జడ్జిగా షమీ పర్వీన్ సుల్తానా

జిల్లా కోర్టులో చైల్డ్ ఫ్రెండ్లీ కోర్ట్ (పోక్సో) జడ్జిగా షమీ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగలశెట్టి సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ మోతుకూరి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రామకోటిరెడ్డి కలిసి అభినందనలు తెలిపారు.

సోదరిని చంపిన తమ్ముడికి యావజ్జీవ శిక్ష

గుంటూరు లీగల్: తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరులో 2017లో జరిగిన ఆస్తి తగాదాలో సోదరిని చంపిన తమ్ముడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గుంటూరు రెండో జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి వై. నాగరాజు తీర్పు వెలువరించారు. ఘటనపై మృతురాలి తండ్రి ఎస్.కె.మౌలా సాహెబ్ తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను అప్పటి తుళ్లూరు సీఐ సుధాకరరావు, పోలీస్ బృందం కోర్టుకు సమర్పించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం సోమవారం ముద్దాయి షేక్ నాగుల్ మీరావలికి ఐపీసీ సెక్షన్ 302 కింద యావజ్జీవ కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సెక్షన్ 307 కింద 10 సంవత్సరాల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ముద్దాయికి శిక్ష పడటంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు షేక్ భర్కత్ అలీ, కేసు విచారణకు కృషి చేసిన కోర్టు మానిటరింగ్ సెల్ సీఐతో పాటు తుళ్లూరు ఏఎస్ఐ ప్రభుదాసు, కానిస్టేబుల్ ప్రసాద్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



చేబ్రోలు: ఏఆర్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతిపై చేబ్రోలు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని వడ్లమూడికి చెందిన కూచిపూడి క్రాంతి కుమార్ గుంటూరు జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఆర్మ్ రిజర్వ్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. 11 ఏళ్ల కిందట తెనాలికి చెందిన ప్రవీణతో అతడికి వివాహమైంది. ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం గుంటూరు చుట్టగుంట ప్రాంతంలోని కేవీపీ కాలనీ దగ్గరలో నివసిస్తున్నారు. 18వ తేదీ గుడ్ ఫ్రైడే రోజున క్రాంతి కుమార్ వడ్లమూడికి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. నారాకోడూరు గ్రామ సమీపంలో రోడ్డు పక్కన పడిపోయి ఉండటంతో స్థానికులు వడ్లమూడిలోని డీవీసీ హాస్పిటల్‌లో చేర్చారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని లలిత వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. భర్త శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ప్రవీణ చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మొక్కవోయిన ఆశయం

- దక్షిణ భారతంలోనే తొలి పార్కు
- 40 రకాల ఫైకస్ జాతుల మొక్కలు, చెట్ల పెంపకం
- నిర్వహణను గాలికొదిలేసిన మున్సిపాలిటీ
- కనీసం మొక్కలకు నీరు పెట్టని నిర్లక్ష్యం
- పార్కు మొత్తం అడవిని తలపిస్తున్న గడ్డి
- అందమైన లైట్లు చోరుల పాలు
- నిర్లక్ష్యానికి నిలువెత్తు చిరునామా

దయనీయస్థితిలో అరుదైన ఫైకస్ పార్కు



దయనీయస్థితిలో ఫైకస్ పార్కు



నిరుపయోగంగా జిమ్ పరికరాలు

తెనాలి: ఆంధ్రా ప్యారిస్‌లో అరుదైన ఫైకస్ పార్కు అది. ఇప్పుడు లోపలకు ప్రవేశించగానే అడవిని తలపిస్తోంది. పార్కు మొత్తం మోకాలి ఎత్తులో పెరిగిన గడ్డి, అడుగు తీసి అడుగు పెట్టేందుకు అవకాశం లేనట్టుగా ఉంది. పార్కులోని దారుల్లోనూ గడ్డి వ్యాపించింది. అక్కడి అరుదైన జాతుల మొక్కలకు కనీసం నీరు కూడా పోయడం లేదు. విద్యుద్దీపాలు అదృశ్యమయ్యాయి. ఓపెన్ జిమ్‌లో వ్యాయామ పరికరాలు వృథాగా కనిపిస్తున్నాయి. మొత్తానికి కళావిహీనమైన స్థితిలో ఉన్న పార్కు నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఉంది.

వంద రకాల ఫైకస్ జాతుల మొక్కలు

దక్షిణ భారతదేశంలోనే మరెక్కడా లేనటువంటి ఫైకస్ పార్కు ఇది. దేశంలోని వివిధ ప్రాంతాల్నుంచి వంద రకాల ఫైకస్ జాతుల మొక్కలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆరంభించారు. మరుగుజ్జు వృక్షాలు, ఆయా జాతుల సాధారణ రకాల మొక్కలను నాటించారు. వివిధ ప్రాంతాల్లోని సుదీర్ఘ జీవిత కాలం కలిగిన వృక్షాలను సైతం యంత్రాల సాయంతో ట్రాన్స్‌లోకేషన్ చేసి, ఇక్కడ నాటారు. మొత్తంమీద 40 జాతుల మొక్కలు, చెట్లతో పార్కుకు కళ తీసుకొచ్చారు. సందర్శకుల కోసం వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్ట్, మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా జిమ్‌లు, ఓపెన్ ఎయిర్ థియేటర్ తదితర హంగులను ఏర్పాటుచేశారు.

2017లో ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రమోహనరెడ్డి ఆలోచనల్లోంచి ఫైకస్ పార్కు 2017లో తెనాలిలో సాకారం కావటం విశేషం. పట్టణానికి ఉత్తరం వైపున విజయవాడ రహదారి పక్కన తూర్పు కాలువ అంచున గల మున్సిపల్ మంచినీటి పథకం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సువిశాలమైన మూడు ఎకరాల స్థలాన్ని ఇందుకోసం ఎంచుకున్నారు. నీటి లభ్యత అందుబాటులో ఉండటంతో అనువైనదిగా భావించారు. కేంద్ర ప్రభుత్వ అమృత పథకం, మున్సిపాలిటీ సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తారు. ఏపీ గ్రీన్ కార్పొరేషన్ తగిన మొక్కలను ఎంచుకుని, దేశంలోని వివిధ ప్రాంతాల్నుంచి సేకరించి, మున్సిపాలిటీకి అందజేస్తుంది. వాటిని నాటించి, సంరక్షించటం మున్సిపాలిటీ బాధ్యత.

ఎండిపోతున్న మొక్కలు

విద్యుత్ సమస్యతో కనీసం మొక్కలకు నీరు పెట్టటం లేదు. కనీసం వాచ్‌మెన్, ల సంరక్షకుడు కూడా లేరు. విద్యుద్దీపాలు చోరులపరమై స్తంభాలు మొండిగా దర్శనమిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్ కనిపించటం లేదు. జిమ్ పరికరాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. ఓపెన్ ఎయిర్ థియేటర్ గ్యాలరీని మొండిగోడలను తలపిస్తున్నాయి. రూ.లక్షలు వ్యయం చేసి, ఏర్పాటుచేసిన పార్కును ఎందుకూ పనికిరాకుండా చేసేంత నిర్లక్ష్యం ఎందుకో అర్థంకాదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. కొసమెరుపు ఏమంటే, 'సాక్షి' ఫొటోలు తీశాక పొక్లయిన్‌తో గడ్డిని తొలగింపజేస్తున్నారు.

100 రకాల మొక్కల పెంపకం లక్ష్యం

ఫైకస్ అంటే మర్రి జాతుల మొక్కలని అర్థం. రావి, మర్రి, జువ్వి, మేడి...తదితర రకాల మొక్కలతో కూడిన పార్కు ఇది. ఫైకస్ జాతి మొక్కలు దేశవ్యాప్తంగా విస్తారంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో 17 రకాలు మాత్రమే ఉన్నాయని అంచనా. ఈ కొరతను నివారించి, కనీసం 100 రకాల మొక్కలను ఒకేచోట పెంచాలనేది ఈ పార్కు ఏర్పాటు లక్ష్యం. నాటి మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. నలభై ఏళ్ల వయసు కలిగిన రెండు మర్రి వృక్షాలను తెనాలి పరిసరాల్లోంచి యంత్రాలతో పెకలించి, పార్కులో నాటించారు. వీటితో పాటు ఎక్కువ వయసు కలిగిన బోన్సాయ్ (మరుగుజ్జు) వృక్షాలనూ రప్పించారు. ఫైకస్‌లోనే ఇతర జాతుల మొక్కలు తెప్పించారు. సందర్శకుల కోసమని 'స్టాండ్ స్టోన్ గజబోస్'గా పిలిచే గోపురం తరహా కుటీర నిర్మాణాలను రాజస్థాన్ వర్కర్లతో చేయించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా జిమ్ పరికరాలను సమకూర్చారు. ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు అవసరమైన గ్యాలరీ నిర్మించారు. పార్కులో ఫైకస్ జాతిపై పరిశోధకులకు అన్నీ అందుబాటులో ఉండే మినీ ఫారెస్టుగా దీన్ని తయారుచేయాలని భావించారు. మొక్క శాస్త్రీయనామం, కుటుంబం, స్థానికంగా పిలిచే పేరు సహా వివరాలన్నింటినీ ప్రతి మొక్కపైనా లేబిలింగ్ చేయాల్సి ఉంది. ఇంత చక్కటి ఆశయంతో రూపుదిద్దిన పార్కు ఇప్పుడు దయనీయస్థితిలో ఉంది.



ఏపుగా పెరిగిన గడ్డి

నేడు కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల



ముస్తాబైన ఆలయం

కొండపాటూరు(కాకుమాను): భక్తుల కొంగు బంగారమైన కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.

ప్రధాన ఘట్టం శిడిమాను మహోత్సవం

ఒక పెద్ద దులానికి చివరి భాగాన ఇనుప బోనును ఏర్పాటు చేస్తారు. అందులో మేకపోతును ఉంచి సాయంత్రం ఆరు గంటల సమయంలో గ్రామ పురవీధులలో మేళ తాళాలు, కనక తప్పెట్ల మధ్య ఊరేగిస్తారు. శిడిమాను బయలుదేరే ముందు శిడి పెద్ది కొడుకుని ప్రత్యేకంగా అలంకరించి, దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ పురవీధుల్లో తిప్పుతారు. దీంతో శిడిమాను బయలు దేరేందుకు సిద్ధమైందని గ్రామస్తులంతా దేవాలయం వద్దకు చేరుకుంటారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు శిడిమానును ఏర్పాటు చేశారు. ఆ పెద్ద దూలానికి రైతులు పండించిన వివిధ రకాల పంటలను కట్టి, చల్లంగా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నారు. తిరునాళ్లలో వినోదం అందిచేందుకు రంగుల రాట్నాలు, జెయింట్ వీల్‌లను ఏర్పాటు చేశారు. చిన్నారులకు ఆట వస్తువులు, గృహోపకరణాల దుకాణాలు ఏర్పాటు చేశారు.

చంద్రబాబు అబద్ధాలకోరు



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు. వేదికపై వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నేతలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజం
- కూటమి సర్కార్ దగా ప్రభుత్వం
- పంటలకు గిట్టుబాటు ధర కరువు
- అల్లాడుతున్న రైతులు

పట్నంబజారు: కూటమి సర్కార్ దగా ప్రభుత్వమని, ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలకోరని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం కొట్టుమిట్టాడుతోందని ధ్వజమెత్తారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఒక ప్రైవేట్ హోటల్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పలు అంతర్గత అంశాలతో పాటు వివిధ సమస్యలపై నేతలు కూలంకషంగా చర్చించారు. పలు అంశాలను ప్రతిపాదించి, ఆమోదించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో మాట్లాడానని, రూ. 11,801 గిట్టుబాటు ధర కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా, పలు సమావేశాల్లో చెప్పిన చంద్రబాబు ఒక్క టిక్కీ కూడా కొనలేదని మండిపడ్డారు. గుంటూరులో శంకర్ విలాస్ వద్ద ఆర్వోబీ నిర్మాణాన్ని రూ. 98 కోట్లతో చేపట్టడం వల్ల ప్రజలకు మంచి కంటే చెడు అధికంగా జరిగే అవకాశం ఉందని, దీనిపై పునరాలోచించాలని ప్రభుత్వానికి అంబటి సూచించారు. 2104–19 మధ్యలోనే రూ. 167 కోట్లతో ఐకాన్ బ్రిడ్జి ప్రపోజల్ చేసిన టీడీపీ నేతలు, ఇప్పుడు రూ. 98 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం ఎలా పూర్తవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ. 300 కోట్లుతో నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

● వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణం అంశంలో ఒక అడ్వైజరీ కమిటీ వేసి చర్చించాలని సూచించారు. కేవలం ముగ్గురు, నలుగురు కలిసి తీసుకునే నిర్ణయం కాదన్న విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కేంద్ర మంత్రి పెమ్మసానికి గుంటూరుతో అసలు సంబంధం లేదని, ఆయనకు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రజల బాధలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నగర అధ్యక్షులురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తెనాలి మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మెట్టు వెంకటప్పారెడ్డి, మండేపూడి పురుషోత్తం, ఈమని రాఘవరెడ్డి, సీడీ భగవాన్, కొత్తా చిన్నపరెడ్డి, శేషగిరి పవన్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, మామిడి రాము, విజయ్, నందేటి రాజేష్ పాల్గొన్నారు.

భళా.. రామకృష్ణ విద్యా తృష్ణ

- 58 ఏళ్ల వయస్సులో కార్డియాలజీ పీజీ పూర్తి చేసిన గుంటూరు వైద్యుడు
- గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుదైన రికార్డు
- నాలుగు పీజీలు పూర్తి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాజుల రామకృష్ణ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. సోమవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన పీజీ సూపర్ స్పెషాలిటీ పరీక్ష ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణత సాధించారు. కార్డియాలజీలో పీజీ పూర్తి చేసి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా నాలుగు పీజీ వైద్య విద్యలు జనరల్ మెడిసిన్, పల్మనరీ మెడిసిన్, న్యూరాలజీ, కార్డియాలజీ అభ్యసించారు. ఇన్‌ఫెక్షన్ డిసీజెస్, డయాబెటాలజీలో డిప్లొమో కోర్సులు పూర్తి చేశారు.

చావలి వాస్తవ్యులు

గుంటూరు జిల్లా వేమూరు మండలం చావలికి చెందిన గాజుల వీరశేఖరరావు, లీలావతి దంపతుల కుమారుడు రామకృష్ణ గుంటూరు ఎల్ ఈఎం స్కూల్‌లో 7వ తరగతి వరకు చదివారు. బాలకుటీర్ స్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు, గుంటూరు జేకేజీ కళాశాలలో ఇంటర్ అభ్యసించారు. గుంటూరు వైద్య కళాశాలలో 1986 – 92లో ఎంబీబీఎస్, 1998– 2000లో పల్మనాలజీలో పీజీ చేశారు. 2001 నుంచి 2004 వరకు వెల్దుర్తి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. 2004 నుంచి 2006 వరకు ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రిలో ట్యూటర్‌గా పని చేశారు. 2006 నుంచి 2009 వరకు జనరల్ మెడిసిన్‌లో గుంటూరులో పీజీ అభ్యసించారు. 2009 నుంచి 2011 వరకు గుంటూరు జీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. 2011 నుంచి 2014 వరకు తిరుపతి సిమ్స్‌లో న్యూరాలజీలో పీజీ వైద్య విద్యను అభ్యసించారు. 2014 నుంచి నేటి వరకు గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ 2022లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. పీజీ నీట్ ఎంట్రన్స్‌లో ర్యాంకు సాధించి కార్డియాలజీ సూపర్‌స్పెషాలిటీ పీజీలో మంగళగిరి ఎన్నారైలో చేరారు. నేడు విజయవంతంగా కార్డియాలజీ పీజీ కోర్సు పూర్తి చేసుకుని, నాలుగు పీజీలు చదివిన ఏకైక వైద్యుడిగా అరుదైన రికార్డు డాక్టర్ రామకృష్ణ సొంతం చేసుకున్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ

తిరుపతిలో పీజీ వైద్య విద్యార్థిగా ఉన్న సమయంలో డాక్టర్ గాజుల రామకృష్ణ 86 స్పోర్ట్స్ మెడల్స్ దక్కించుకున్నారు. 33 న్యూరాలజీ క్విజ్ పోటీల్లో విజేతగా నిలిచి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. 2014లో నేషనల్ క్విజ్ పోటీలో విన్నర్‌గా నిలిచారు.

మహిళలను రాత్రి వేళ నిర్బంధించిన పోలీసులు

- వైన్ షాప్ వద్దని నిరసన తెలిపినందుకు అక్రమ కేసు
- టీడీపీ నేతల అండదండలతో పోలీసుల ఓవర్ యాక్షన్



స్టేషన్‌లో మహిళలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): పోలీసు యంత్రాంగం టీడీపీ నేతలకు దాసోహమై మహిళలపై వేధింపులకు దిగారు. సోమవారం రాత్రివేళ మహిళలను స్టేషన్‌కు పిలిపించిన పాత గుంటూరు పోలీసులు దాదాపు మూడు గంటల పాటు నిర్బంధించారు. వైన్ షాపు ఏర్పాటుపై నిరసన తెలిపినందుకు అక్రమ కేసు బనాయించి బెదిరింపులకు పాల్పడ్డారు. కొద్దిరోజులుగా గుంటూరు నందివెలుగు రోడ్డులో మణిహోటల్ సెంటర్ వద్ద లక్కీ వైన్స్ దుకాణ ఏర్పాటును స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. మసీదు, ఆలయం, దగ్గర్లోనే పాఠశాలలు కూడా ఉన్నందున నిరసన తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 20న కూడా స్థానికులు నిరసన తెలియజేసి అడ్డుకున్నారు. దీనిపై బార్ నిర్వాహకుడు ఫిర్యాదు మేరకు పాత గుంటూరు పోలీసులు దౌర్జన్యానికి పాల్పడి అడ్డుకున్నారంటూ స్థానికులపై కేసు నమోదు చేశారు. స్థానికులు బీరం సునీత, పద్మారెడ్డి, షేక్ సైదా, పవన్, గోపీలతోపాటు, మరికొంత మందిపై వైన్ షాపును అడ్డుకున్నారంటూ అక్రమ కేసు బనాయించి నతాయిస్తున్నారు.

రాత్రి 7 గంటలకు పిలిచి 9.30 గంటల వరకు..

పోలీసులు అక్రమ కేసు బనాయించడమే కాకుండా ఆ మహిళలు స్టేషన్‌కు రావాలంటూ బెదిరింపులకు దిగారు. రాత్రి ఏడు గంటలకు వారిని పాత గుంటూరు స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు 9.30 గంటల వరకు కూర్చోబెట్టారు. వైన్ షాపును వ్యతిరేకిస్తున్న అందరి పేర్లు చెప్పాలని బెదిరించారు. మరోవైపు వైన్ షాప్ నిర్వాహకులు తమపై దాడిచేశారంటూ స్థానికులు చేసిన ఫిర్యాదును కనీసం పట్టించుకోలేదు. వైన్ షాపునకు సంబంధించిన వ్యక్తులు వెంకట్, నాగరాజు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారని స్థానికులు ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్య చేపట్టలేదు.

బ్రిడ్జి నిర్మాణం ఆగదు

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హెచ్చరికలు
- నష్టపరిహారం తీసుకుని సహకరిస్తే మంచిది
- స్టేటస్‌కో ఇచ్చిన బిల్డింగ్‌ను కౌన్సిల్‌లో పెట్టి డిస్పోజ్ చేస్తాం

నెహ్రూనగర్: ''శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ విషయంలో ఒక్క బిల్డింగ్ యజమానికి మాత్రమే స్టేటస్ కో ఉంది. దాన్ని వదిలేస్తాం.. దిష్టిబొమ్మలాగా ఉంటుంది.. వారం రోజుల్లో కౌన్సిల్‌లో పెట్టి డిస్పోజ్ చేస్తాం.. అంత దూరం అవసరమా ?'' అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ప్రభావితమయ్యే భవన యజమానులపై ఆయన ఈ విధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. సోమవారం 191 భవన యజమానుల్లో ప్రస్తుతం 21 మందికి మాత్రమే నష్టపరిహారం కింద చెక్కులను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ''బ్రిడ్జి నిర్మాణం ఆగదు.. మీరు ఎంత తొందరగా నష్టపరిహారం తీసుకుని సహకరిస్తే అంత మంచిది.. నిర్మాణాన్ని అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారు.. 51 మంది కోర్టుకు వెళ్లారు.. 44 మంది ప్రొసీజర్ ప్రకారం ఫాలో అవుతామని చెప్పారు.. ప్రొసీజర్ ప్రకారం డబ్బు డిపాజిట్ చేస్తాం..పొక్లెయిన్స్ వచ్చేస్తాయి.. అది అవసరమా ?'' అన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పలువురు భవన యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **7,000** గరిష్టం : రూ. **9,500**

మోడల్ ధర రూ. **8,000**

క్లుప్తంగా

యార్డుకు 1,49,133 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): స్థానిక మార్కెట్ యార్డుకు సోమవారం 1,49,133 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,42,976 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,400 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,568 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పసుపు ధరలు



దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు సోమవారం 115 బస్తాలు వచ్చాయని, మొత్తం అమ్మినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 55 బస్తాలు వచ్చాయని, వాటి కనిష్ఠ ధర రూ.11,350, గరిష్ఠ ధర రూ.11,350, మోడల్ ధర రూ.11,350 పలికిందని పేర్కొన్నారు. కాయలు 60 బస్తాలు వచ్చాయని, వాటి కనిష్ఠ ధర రూ.11,350, గరిష్ఠ ధర రూ.12,400, మోడల్ ధర రూ.11,350 లభించినట్లు తెలియజేశారు. మొత్తం 86.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

ఉద్యోగాల పేరిట టోకరా

- రూ. లక్షల్లో కాజేశారని బాధితుల ఆవేదన
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొర

నగరంపాలెం: ఉద్యోగాల పేరిట మోసగించారంటూ పలువురు బాధితులు వాపోయారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కొలువులు ఇప్పిస్తామని ఆశ చూపి, లక్షల్లో కాజేశారని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఏఎస్పీ (పరిపాలన) జి.వి.రమణమూర్తి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి మొరను ఆలకించారు. చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. డీఎస్పీలు శివాజీరాజు (క్రైం), శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్) కూడా అర్జీలు స్వీకరించారు.



బాధితుల సమస్యను ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

రైల్వేలో ఉద్యోగం పేరిట మోసం

గతేడాది జనవరిలో భార్యాభర్తలు పరిచయమాయ్యారు. రైల్వేవర్క్ షాప్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. దీంతో వారికి రూ.4.60 లక్షలు చెల్లించాను. ఉద్యోగం త్వరగా వస్తోందని చెప్పారు. అయితే నెలలు గడిచాయి. వారిద్దరిపై స్థానిక పోలీసులకు కూడా ఫిర్యాదు చేశా. గతేడాది నవంబర్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. నెలలు గడిచినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు. దీనిపై గతంలో ఒకసారి జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశా. ప్రస్తుతం కుటుంబ ఆర్థిక పరిస్థితులు వెంటాడుతున్నాయి. నాకు న్యాయం చేయాలి.

– కె.మహేష్‌బాబు, మారీసుపేట, తెనాలి

మోసం చేసిన సహచర విద్యార్థిని

ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నా. సహచర విద్యార్థిని పరిచయమై, హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపింది. నెలకు రూ.80 వేలు జీతమని, గతంలో ముగ్గుర్ని చేర్పించినట్లు పేర్కొంది. దీంతో ఇటీవల ఆమె బ్యాంక్ ఖాతాకు రూ.1.05 లక్షలు పంపించా. ఉద్యోగ విషయమై ఆమెను పలుమార్లు అడగ్గా కాలయాపన చేస్తోంది. గతంలోనూ ఆమె పలువుర్ని మోసగించినట్లు తెలిసి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. పది రోజుల్లో మొత్తం చెల్లిస్తానని ఒప్పుకుంది. అయితే ఇప్పటి వరకు నగదు చెల్లించలేదు. అదేమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతోంది.

– ఎస్. నాగరాజు, అగతవరప్పాడు, పెదకాకాని మండలం.

అర్జీల పరిష్కారం త్వరగా పూర్తిచేయాలి

డీఆర్వో షేక్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను మరింత వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని, అధికారులు సమన్వయం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజలు కూడా అర్జీలను స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చని సూచించారు. దీంతో స్థానిక సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన 290 అర్జీలను ఆయనతో పాటు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డీపీఓ సాయి కుమార్, జిల్లా అధికారులు పరిశీలించారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో షేక్ ఖాజావలి

ఇళ్ళ మధ్యలో వైన్ షాపులు

ఈ ప్రభుత్వం మద్యం వ్యాపారులకిస్తున్న ప్రాముఖ్యత ఓట్లు వేసిన వారికి ఇవ్వడం లేదు. పాత గుంటూరులోని మణి హోటల్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేని కలిసినా ప్రయోజనం లేదు. ఎక్సైజ్ శాఖాధికారులు కూడా మద్యం వ్యాపారులకే వత్తాసు పలుకుతున్నారు. విద్యాలయాలు, ప్రార్థన మందిరాల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు తగదు. వెంటనే చర్యలు తీసుకోవాలి.

-పాత గుంటూరు వాస్తవ్యులు

పెన్షనర్లపై ఎందుకీ వివక్ష ?



ఇంటర్మీడియేట్ విద్యా పెన్షనర్లను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. కనీస బెనిఫిట్స్ కూడా అందనివ్వడం లేదు. అందరికీ 70 సంవత్సరాలు దాటాయి. 11వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలి. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 10 శాతం ఇప్పించాలి. మెడికల్ సదుపాయాలు కల్పించాలి.

-ఏపీ ఇంటర్మీడియేట్ విద్యా పెన్షనర్ల సంక్షేమ సంఘం సభ్యులు

మహిళలంతా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- అదే లక్ష్యంతో పని చేస్తున్న కూటమి ప్రభుత్వం



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్తిపాడు: ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలోని సీతారామాంజనేయ స్వామి కల్యాణ మండపంలో సోమవారం వెలుగు ఏపీఎంలు, సీసీలు, వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హాజరయ్యారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలు, పథకాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో మహిళల ముంగిటకు మరెన్నో అవకాశాలను తీసుకొస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బూర్ల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రిక 'డ్వాక్రా' అని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళ వ్యాపారవేత్తగా తయారవ్వాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. పెమ్మసాని ఆధ్వర్యంలో కేంద్ర దీన్ దయాళ్ ఉద్యోగ్ గ్రామ కౌశిక్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారవేత్తలను చేసేందుకు నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళను గుర్తించనున్నామని తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 151 గ్రామైక్య సంఘాల్లో ఐదు వేల ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, 51 వేల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని తెలిపారు. వీరంతా 25 ఏళ్లుగా పొదుపులు తీసుకుని, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నా, జీవనోపాదుల కార్యక్రమం ఆశించినంతగా జరగడం లేదని తెలిపారు. అందువల్ల ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త వచ్చేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల వెలుగు ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

కిశోర బాలికల సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జేడీ శిరీష



మాట్లాడుతున్న శిరీష

గుంటూరు ఎడ్యుకేషన్: కిశోర బాలికల సమగ్రాభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. శిరీష పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో కిశోర బాలికల కోసం నిర్వహించాల్సిన కార్యక్రమాలపై రూపొందించిన ప్రత్యేక కేలండర్‌పై సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని వివిధ శాఖ అధికారులు, సిబ్బందికి ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. యూనిసెఫ్ సహకారంతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న శిరీష బాల్య వివాహాలు, రుతుక్రమ పరిశుభ్రత, బాలల హక్కులు, పోషణ-ఆరోగ్యం, లింగ సమానత్వం, విద్య ఆవశ్యకత, నైపుణ్యాభివృద్ధి-ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కిశోర వికాసంపై గ్రామస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాల ప్రణాళికపై చర్చించారు. జిల్లాల వారీగా రూపొందించిన కార్యాచరణకు అనుగుణంగా పని చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. వర్క్‌షాప్‌లో జాయింట్ డైరెక్టర్ బి. మనోరంజని, ప్రాంతీయ డెప్యూటీ డైరెక్టర్ ఎస్. జయలక్ష్మి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కేవీఏఎస్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ప్రోగ్రాం మేనేజర్ కె. కమల్‌కుమార్, నాగమల్లేశ్వరి, సీడీపీవోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

హెల్త్ యూనివర్సిటీ టాపర్‌గా గుంటూరు వైద్యుడు



డాక్టర్ కార్తిక్‌రెడ్డి, డాక్టర్ అజ్మ, డాక్టర్ కాంతిమాలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో పీజీ తృతీయ సంవత్సరం చదువుతున్న డాక్టర్ పప్పిరెడ్డి కార్తిక్‌రెడ్డి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సోమవారం ప్రకటించిన పీజీ సూపర్ స్పెషాలిటీ పరీక్ష ఫలితాల్లో టాపర్‌గా నిలిచాడు. డీఎం న్యూరాలజీ పరీక్ష ఫలితాల్లో 800 మార్కులకు గాను 649 సాధించి హెల్త్ యూనివర్సిటీలో ప్రథమ స్థానం సాధించాడు. ద్వితీయ, తృతీయ స్థానం కూడా గుంటూరు జీజీహెచ్ వైద్యులే సాధించి రికార్డు సృష్టించారు. డాక్టర్ అజ్మ హెల్త్ యూనివర్సిటీ సెకండ్ టాపర్‌గా, డాక్టర్ కాంతిమాల థర్డ్ టాపర్‌గా నిలిచి గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగ ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో మారుమోగేలా చేశారు.

స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ ప్రదానం

యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన డాక్టర్ కార్తిక్‌రెడ్డికి హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం రోజు గోల్డ్‌మెడల్ అందిస్తారు. కాగా, హెల్త్ యూనివర్సిటీ పరీక్షా ఫలితాల్లో డీఎం న్యూరాలజీలో వరుసగా మూడు సార్లు గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులే టాపర్లుగా నిలిచి చరిత్ర సృష్టించారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో నాలుగు పీజీ సీట్లు ఉన్నాయి. పరీక్ష రాసిన నలుగురిలో ముగ్గురు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు యూనివర్సిటీ స్థాయిలో సాధించి రికార్డు సృష్టించారు. గుంటూరు జీజీహెచ్‌లో న్యూరాలజీ అభ్యసించిన డాక్టర్ లలిత, డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద హెల్త్ యూనివర్సిటీ టాపర్లుగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా, మూడో సారి డాక్టర్ పి.కార్తిక్‌రెడ్డి గోల్డ్ మెడల్ అందుకోనున్నారు. కడపకు చెందిన డాక్టర్ పప్పిరెడ్డి కార్తిక్‌రెడ్డి కర్నూలులో ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యనభ్యసించి సూపర్‌స్పెషాలిటీ పీజీ న్యూరాలజీ గుంటూరులో చేరాడు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన డాక్టర్ కార్తిక్‌రెడ్డిని, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన డాక్టర్ అజ్మా, డాక్టర్ కాంతిమాలను గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అభినందించారు. ఆయన గైడెన్స్ వల్లే తాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించగలిగానని డాక్టర్ కార్తిక్‌రెడ్డి తెలిపారు.

మే 5న సీఎం కార్యాలయం ముట్టడి

లక్ష్మీపురం: బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మే 5న ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గల మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం కొనుగోలు చేసిన విధంగా కంపెనీలతో క్వింటా పొగాకు రూ.18 వేలకు కొనుగోలు చేయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు పాల్గొన్నారు.

డీఈవో సైట్‌లో హెచ్‌ఎం, టీచర్ల సీనియార్టీ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, హెచ్‌ఎంల సీనియార్టీ జాబితాను డీఈవో బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 23వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి హైదరాబాద్‌కు బదిలీ

నేడు బాధ్యతలు స్వీకరించనున్న సుజిత్ మల్లిక్



కమిషనర్ సాధు నరసింహారెడ్డిని సత్కరిస్తున్న సుజిత్ మల్లిక్, అధికారులు

లక్ష్మీపురం: ఉద్యోగుల సమష్టి సహకారంతోనే రెవెన్యూ పరంగా సెంట్రల్ జీఎస్టీ శాఖను అగ్రస్థానంలో నిలబెట్టగలిగానని సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆయన హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన కమిషనర్‌గా సుజిత్ మల్లిక్ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా స్థానిక కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నరసింహారెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో గుంటూరు కమిషనరేట్‌తో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఎం.నాగరాజు, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.యుగంధర్, గాదె శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అనంతరం ఉద్యోగులు కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి. రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, కె.యుగంధర్, నవీన్ రాజు, చీదెళ్ల ఈశ్వరరావు, చిట్టి వెంకటేశ్వరరావు, కాకర్ల శ్రీనివాస్, పూర్ణ సాయి పాల్గొన్నారు.

లేబర్ కోర్టు ఏజీపీగా ఫారూఖ్

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని లేబర్ కోర్టుకు ఏజీపీగా షేక్ ఫరూక్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రయాణికుల భద్రతే డ్రైవర్, గార్డుల లక్ష్యం

సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ రవికిరణ్



లోకో పైలట్ సైన్ ఇన్ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ రవికిరణ్

లక్ష్మీపురం: రైలు ప్రయాణికుల భద్రతే డ్రైవర్, గార్డుల లక్ష్యమని, రైలును సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంలో ఇద్దరూ చాలా కీలకం అని సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ మద్దాలి రవికిరణ్ అన్నారు. రైలు భద్రత చర్యల పై మీడియా పర్యటన కార్యక్రమంలో భాగంగా గుంటూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం ఆయన అసిస్టెంట్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ సీహెచ్. బాపయ్య, డీసీఎం కమలాకర్‌బాబుతో కలసి 4వ నంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న క్రూ లాబీ, స్టేషన్ పశ్చిమాన రన్నింగ్ రూమ్‌లను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ డివిజన్‌లో 227 మంది లోకో పైలట్లు, 138 మంది రైలు మేనేజర్లు ఉన్నారని తెలిపారు. స్టేషన్‌లో ఉన్న క్రూ లాబీ పని చేసే విధానాన్ని వివరించారు. విధుల సమయంలో ఎదురయ్యే సమస్యలను సిబ్బంది క్రూ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంఎస్)లో కూడా రికార్డు చేయవచ్చని చెప్పారు. క్రూ లాబీలో లోకో పైలెట్ సైన్ ఇన్ చేసి, సైన్ ఆఫ్ చేసిన తరువాత సిబ్బందికి బ్రీత్ అనలైజర్ పరీక్ష చేస్తామని వివరించారు. మద్యంపై పాజిటివ్‌గా వచ్చిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది విధులకు వెళ్లేటప్పుడు ఫాగ్ సేఫ్ డివైస్ (ఎఫ్ఎస్‌డి) పరికరాలు వాకీ టాకీ అందిస్తామని చెప్పారు. సెల్‌ఫోన్లు క్రూ లాబీలో ఉంచాలని, లోకో పైలెట్ వెంట తీసుకు వెళ్లకూడదని తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రవిరాజు, డివిజన్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి ఉపాధ్యాయులకు ప్రత్యేక వైకల్య నిర్ధారణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీల్లో భాగంగా శారీరక వైకల్య కేటగిరీలో ప్రాధాన్యత పాయింట్లు పొందగోరు అన్ని కేటగిరీలకు చెందిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు ఈనెల 24,25,26వ తేదీల్లో గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతూ ఆధారపడిన కుటుంబ సభ్యులు గలవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ శస్త్రచికిత్సలు చేయించుకున్న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు వైద్య శిబిరానికి హాజరు కావాలని ఆమె సూచించారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, అవయవ మార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి, స్పైనల్ సర్జరీ, మానసికంగా బాధపడుతున్న భార్య, భర్త, పిల్లలు, వైద్యం పొందుతున్న వారితో పాటు జువైనల్ డయాబెటిస్, థలసేమియా, హీమోఫీలియా, మస్కులర్ డిస్ట్రోఫితో బాధపడుతున్న, ఆధారిత పిల్లలు, వైద్యం పొందుతున్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆమె సూచించారు. ప్రాధాన్యత క్రమంలో పాయింట్లు పొందగోరు ఉపాధ్యాయులు విధిగా నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, జీజీహెచ్ మెడికల్ బోర్డు జారీ చేసే సర్టిఫికెట్ల ఆధారంగా బదిలీల్లో ప్రయోజనం పొందడానికి అవకాశం ఉందని తెలిపారు.